## కథ

బెంగుళూర్ నుంచి బయల్దేరినప్పటి నుంచి నా ఆలోచనలన్నీ నానమ్మచుట్టే తిరుగుతున్నాయ్. ఇక్కడ ఇంజనీరింగ్‌లో జాయినయ్యాక మూడేళ్లనుంచి ఇంటికి వెళ్లలేదు, మమ్మీ డాడీలతో ఫోన్లో మాట్లాడటం తప్ప... అలాంటిది... నానమ్మ చనిపోయిందన్న ఉత్తరం... బస్సులో కూర్చున్నా... నానమ్మే గుర్తొస్తోంది. మాకు అందమైన జీవితాన్ని నేర్పిన నానమ్మ... ముగ్గురు కొడుకుల్నేకాదు ఐదుగురు మనవల్ని, నలుగురు మనవరాళ్లని తీర్చిదిద్దిన నానమ్మ... తాతయ్య ఏనాడో చనిపోయినా పెద్ద దిక్కుగా నిలిచింది.



# నానమ్మ

**-కె.వి.నరేందర్**

నానమ్మ టీచర్‌గా రిటైరయి ఆరేళ్ళయింది. రిటైరైన రోజే నానమ్మ కృంగిపోయినట్లుగా కనిపించింది... అప్పటికే ముగ్గురు కొడుకులు పెద్ద ఉద్యోగాల్లో ఉన్నారు. తన ఆరు వేల జీతాన్ని ఆ ఉమ్మడి కుటుంబంలో ఏ కొడుకు చేతా నయా పైసా పెట్టించలేదు అప్పటివరకు...

పెన్షనయ్యాక నానమ్మ జీతం రెండున్నర వేలు దాటకపోయేసరికి ఇంట్లో ఎవరికి వాళ్లు ఆర్థిక ఇబ్బందుల్ని సృష్టించుకుని ఎడమొహం పెడమొహంగా తప్పుకు తిరిగారు నాల్రోజుల్లో నానమ్మ మీది ప్రేమ మంచుగడ్డల్లా కరిగిపోయింది. కొడుకులకి కోడళ్లకీ నానమ్మ భారంగా మారి ఫలితంగా నానమ్మకో గది కేటాయించారు, నులక మంచం వేశారు, ఆమెకో ఒంటరి ప్రపంచాన్ని సృష్టించారు.

నేను ఇంజనీరింగ్‌లో జాయిన్ అవ్వడానికి బెంగుళూర్ వెళ్లే ముందు నన్ను పిలిచింది. "ఒరే మన్‌ప్రీతమ్... నువ్వు వెళ్లేముందు మీ తాతయ్య ఫోటో ఒకటి ఎన్‌లార్జ్ చేయించి ఫ్రేమ్‌కట్టించి తీసుకు రారా!... "ఈ గదిలో పెట్టుకుంటాను" అంది. ఆమె కళ్లల్లోను, గొంతులోను ఏదో అవ్యక్తమైన బాధ. "ఫ్రేమ్ కాదు నానమ్మా... లామినేషన్ చేయించి తీసుకువస్తాను ఈ రోజే... సరేనా?" అన్నాను. నానమ్మ నా తల నిమిరింది. ఆ తర్వాత నేను బెంగుళూర్ వచ్చాక నానమ్మ నుంచి రెండు ఉత్తరాలు వచ్చాయి అంతే...! గ్రాట్యువిటీ డబ్బు లక్షన్నర వచ్చాక అవి పంచగానే మీ అమ్మలూ, నాన్నలూ చాలా ప్రేమగా చూసుకుంటున్నారని, మన జీవితాలన్నీ ఆర్థిక సంబంధాలతో పూర్తిగా ముడిపడ్డాయంటూ రాసింది.

ఏదేమైనా నానమ్మని బాగా

చూసుకుంటున్నారన్న సంతోషంలో ఉండి
పోయాను. హైవే మీద బస్సు ప్రయా
ణంలో... నానమ్మను దర్శించుకుంటూ
కళ్ళుమూసుకున్నాను.

★ ★ ★

ఇంట్లో అడుగుపెట్టగానే నానమ్మ ఫోటో
చూసి గుండె కదిలిపోయింది. గుండెపొరల్లో
నిక్షిప్తమైన జ్ఞాపకాల శకలాలు కుప్పకూలు
తుంటే పొంగుతున్న కన్నీళ్ళతో అమ్మని
పట్టుకుని బావురుమని ఏడ్చాను. ఇంట్లో
శ్మశాన స్తబ్దత పలుచబడుతోంది. చాలాసేప
టివరకు ఏమీ మాట్లాడలేకపోయాను...
గొంతునరాలు ముడిపడ్డట్టు...

తెల్లారితే పదకొండోరోజు... పెద్దకర్మ.
మా నాన్న, బాబాయిలు ఆ ఏర్పాట్లలో
మునిగిపోయారు. అన్నం తినేటప్పుడు
అమ్మ మాత్రం చెల్లింకి వచ్చిన పెళ్ళి
సంబంధం గురించి చెప్తోంది. మర్నాడు
ఇంటిముందు పెద్ద షామీయానా వేశారు,
దాదాపు వెయ్యిమందికి సరిపడా వంటలు
వండిస్తున్నారు.

నానమ్మ ఫోటోకి భారీ మల్లెపూలదండ
వేశారు. ముగ్గురు కొడుకులూ పెద్ద ఉద్యోగ
స్తులే కాబట్టీ పెద్ద పెద్ద వాళ్లే వచ్చి పలకరిస్తు
న్నారు. బ్రాహ్మడి కార్యక్రమమంతా
అయ్యాక ఒక్కొక్కరు నానమ్మ ఫోటోకి
దండంపెట్టి భోజనంవైపు వెళ్తున్నారు. నా
మనసు కొంచెం పొంగిపోయింది. నానమ్మ
పెద్దకర్మని ఇంతగొప్పగా జరిపిస్తున్నందుకు
నానమ్మ ఆత్మ తప్పకుండా శాంతిస్తుంది,
గర్వపడుతుంది కూడా...!

నానమ్మ ఫోటో తప్పిస్తే... అది పెద్ద
కర్మలా కాదు పెళ్లి సందడిలా అనిపిస్తోంది.
మా వాడలోని కొందరు పేదవాళ్లకి కాటన్‌చీ
రలు, ధోవతులు పంచిపెట్టారు. "మేమంతా
పెద్ద హోదాలో ఉండటానికి మా అమ్మే కార
ణం సార్..." అంటున్నాడు పెద్దనాన్న ఎవరి
తోనో.

"అందుకే మా అమ్మ పెద్దకర్మ మా
స్థాయిలో ఇంత గ్రాండ్‌గా చేస్తున్నామండీ"
అన్నాడు ప్రక్కనే ఉన్న మా నాన్న.

"మా అమ్మది శిలా విగ్రహం కూడా మా
తోటలో పెట్టించాలనుకుంటున్నాం
కూడా..." అని మాటలు కలిపాడు
చిన్నాన్న. ఆ మాటలు విన్న పెద్ద మనిషి...
"మీరు చాలా గ్రేట్ సన్స్... వెరిగుడ్..."
అన్నాడు.

మా నాన్నల ముఖాలు ఎంతగా వెలిగిపో
యాయంటే... అమ్మ
పోయిందన్న బాధ అసలే కనిపించలేదు.

అసలు పెద్ద కర్మ అనేది ఎందుకు చేస్తారు
?

ఆత్మ శాంతించడానికి...

కానీ ఇక్కడ స్థాయిలు, హోదాలు ప్రద
ర్శించడం జరుగుతుందా అనిపించింది.
'ఆమె మాకు తల్లిలాంటిది... అందుకే అంద
రం కలిసి అనుకుని నలభై వేలతో ఈ ఫంక్షన్
చేస్తున్నాం" అమ్మ ఎవరితోనో చెప్తోంది.

అమ్మ ఈ రోజు పట్టు చీర కట్టుకుని నగల
నలంకరించుకోవడమే నా మనసు కలుక్కు
మంది.

"మా యింట్లో ఐదేళ్ళ నుంచి ఫంక్షనేమీ
జరగలేదు. అందుకే కాస్త గ్రాండ్‌గా..."
పిన్ని చెప్తోంది.

"ఇంతలో పని మనిషి రంగమ్మ వచ్చి
అమ్మగారూ ఆవిడగారి గది శుభ్రం చేశా
నండీ" అంది.

"ఎవరి గదమ్మా?" అడిగాను అమ్మని.

"అదేరా... మీ నానమ్మది ఆవిడపో
యారు గదా! ఆ గదిని గెస్ట్ రూమ్‌గా చేద్దా
మని" అంటూ వెళ్ళింది.

అప్రయత్నంగా నా అడుగులు నానమ్మ
గది వైపు సాగాయి.

గోడలనిండా విషాదం గూడుకట్టుకున్న
ట్టుగా ఉందా గది...

గోడ మీద తాతయ్య ఒంటరిగా నవ్వుతు
న్నాడు. గదంతా శుభ్రంగా ఉన్నా షెల్ఫ్‌లో
దుమ్ముపట్టి వున్న పుస్తకం కనపడింది.

నానమ్మది భగవద్గీత అయ్యుంటుందని
అనుకుంటూ ఆ పుస్తకం పైగల కవరు మీది
దుమ్ముదులిపి తీశాను.

భగవద్గీత కాదది... నానమ్మ డైరీ... !

ఎక్కడో మధ్య పేజీ తెరిచాను.

మే 24... "గొంతెండిపోతుందని మొత్తు
కున్నా ఎవరూ గుటికెడు నీళ్ళు కూడా
పొయ్యలేదు..."

ఆ వాక్యం చదివి నా గుండె కవాటాలు
ఫెటిళ్ళుమని చిట్లిపోయాయి... అప్రయ
త్నంగానే మరో పేజీ తీశాను.

జూలై 16...

నన్ను బ్రతికించాలనుకుంటున్నది కేవ
లం నా పెన్షన్ డబ్బుల కోసమేనన్న నిజం...
వాళ్ళ మాటల్లో ఈ రోజు తెలిశాక... నాకు
చచ్చిపోవాలనిపించింది"... ఎక్కడో నా
హృదయాంతరాల్లో భీకర కంపనాలు పాకి
పోతున్నాయి.

అతి కష్టంగా వ్రాసినట్లున్నాయి ఆ అక్ష
రాలు.

సెప్టెంబర్ 7....

అంతా కలిసి వృద్ధుల శరణాలయంలో
వేస్తామంటే వద్దని దుఃఖంతో చేతులెత్తి
ప్రార్థించాను.... దయకలిగి కరుణించారు.

సెప్టెంబరు 11...

మలమూత్రాలు మంచంలోనే చేసుకుం
టున్నానని అన్నం పెట్టడం తగ్గించారు...

అక్టోబర్ 3...

రెండు రోజుల్నుంచీ కనీసం నాకు అన్నం
కూడా లేదు... గదిలోకి ఎవరూ రాలేదు...
నా గుండె నెవరో ఇనుప చువ్వల్తో పొడుస్తు
న్నట్లయ్యింది.

ఆ తర్వాత నానమ్మ డైరీ నిండా ...
నానమ్మ లాంటి తెల్ల పేజీలే...

నానమ్మ మనసులాంటి తెల్ల పేజీలు...

కళ్ళు కన్నీళ్ళతో కప్పబడిపోయాయి...
డైరీని గుండెలకు హత్తుకున్నాను.

బావురుమంటూ మరుక్షణంలో నా గుండె
పగిలేలా ఉంది...

అప్పుడే గదిలోకి వచ్చిన నాన్న...

"ఒరేయ్ మన్ ప్రీతమ్... నువ్విక్కడేం
చేస్తున్నావ్ ?... అక్కడ డిస్ట్రిక్ట్ ఎగ్జిక్యూటివ్
ఇంజనీరుగారు వచ్చారు కార్లో... ఆయనకేం
అవసరాలున్నాయో చూడు... పో... రేపు నీ
ఉద్యోగానికి ఆయనతోనే పని... వెళ్ళొళ్ళు"
అని చెప్పి వెళ్ళిపోయాడు.

ఎక్కడికి వెళ్ళిపోవాలో తెలియక నేను
గదిలో ఉండిపోయాను. మూగగా
రోదిస్తూ...

★



అలా నడుస్తూ వెళ్ళిపోయిన కథకుల కథకుడు మధురాంతకం గారికి నివాళులు